క్లుప్తంగా

కడుపు నొప్పి భరించలేక ఒకరి ఆత్మహత్య

మాక్లూర్: కడుపు నొప్పి భరించలేక కొత్తపల్లి గ్రామానికి చెందిన కుర్మే బాయికాడి మల్లయ్య(49) మంగళవారం తెల్లవారుజామున క్రిమి సహారక మందు సేవించి ఆత్మహత్య చేసుకున్నారు. మాక్లూర్ ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపిన వివరాలు.. మల్లయ్య వారం రోజులుగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. నొప్పి తీవ్రత ఎక్కువ కావటంతో మంగళవారం తెల్లవారుజామున పొలానికని తెచ్చి ఉంచిన క్రిమిసంహారక మందు సేవించారు. భార్య భాగ్యలక్ష్మి గమనించి సమీపా బంధువుల సహాయంతో చికిత్స నిమిత్తం నిజామాబాద్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలోనే మల్లయ్య మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

'నారాయణ' ప్రతినిధి అలా అనడం సరికాదు

బోధన్‌టౌన్(బోధన్): బోధన్‌లో నారాయణ విద్యా సంస్థల పేరును ప్రచారం చేసుకుంటున్నారని నారాయణ విద్యా సంస్థల ఏజీఎం శివాజీ పటేల్ అనడం సరికాదని నారాయణ(పూర్వం విజయసాయి పాఠశాల) పాఠశాల ప్రిన్సిపాల్ సుబ్బారావ్ పేర్కొన్నారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ సుబ్బారావు ఓ ప్రకటనలో తెలుపుతూ..విజయ సాయి విద్యా సంస్థలను కొనుగోలు చేసి మంచి విద్యను అందిస్తున్న తరుణంలో శివాజీ పటేల్ తనను సంప్రదించి విజయసాయి కళాశాల ఆవరణలో నారాయణ పాఠశాల నడుపుకుందామని, డేస్ స్కాలర్ పాఠశాలను వారు, హాస్టల్ తన ఆధ్వర్యంలో నడుపుకోవడానికి మాట్లాడుకున్నామని వివరించారు. దీనికి సంబంధించి నగదును ఆయన చలానా రూపంలో నగదు కూడా చెల్లించాడని చెప్పారు. ఇప్పుడేమో విద్యార్థుల తల్లి దండ్రులు మోసపోవద్దని తనను బదనాం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

బిల్లుల పంపిణీ



వర్ని: నెహ్రూ నగర్, వకీల్ ఫారం గ్రామాలలో డబుల్ బెడ్ రూం లబ్ధిదారులకు బిల్లులను మంగళవారం బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి సురేందర్ రెడ్డి పంపిణీ చేశారు. జెడ్పీటీసీ హరిదాసు, సర్పంచుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు నాని బాబు, వర్ని మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు గోపాల్, వర్ని సొసైటీ అధ్యక్షుడు సాయిబాబా పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు..



బాల్కొండ: ముప్కాల్ మండలంలో పలు గ్రామాల లబ్ధిదారులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంగళవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ కార్యాలయం వద్ద పార్టీ అధ్యక్షుడు ముస్కు భూమేశ్వర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ ఆకుల చిన్న రాజన్న, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కేటీఎస్‌లో గ్రాడ్యుయేషన్ డే

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని కృష్ణవేణి ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేటీఎస్ జోనల్ ఇన్‌చార్జి శేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. చిన్ననాటి నుంచే కష్టపడి చదివితే ఉన్నతస్థాయికి ఎదుగుతారన్నారు. గ్రాడ్యుయేషన్ పట్టాను ఎలా పొందాలో వివరించారు. పాఠశాల డైరెక్టర్ విజయ్, ప్రిన్సిపాల్ మీనాజ్ పాల్గొన్నారు.

షెడ్యూల్డ్ కులాల మధ్య సమస్యను పరిష్కరించాలి

మోర్తాడ్: మోర్తాడ్‌లో షెడ్యూల్డ్ కులాల మధ్య నెలకొన్న సమస్యను సామరస్యంగా పరిష్కరించాలని జాతీయ మానవ హక్కుల సంఘం సభ్యుడు గన్నారపు శంకర్ సూచించారు. ఆయన సాక్షితో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ప్రతి గ్రామంలో సామాజిక వర్గాల పట్ల సమాన విలువలు, ఆత్మగౌరవంపై అవగాహన కల్పిస్తే గొడవలు చోటు చేసుకోవని తెలిపారు. షెడ్యూల్డ్ కులాలవారు ఐక్యంగా ఉండి ఇతరులకు స్ఫూర్తిని ఇవ్వాలని కోరారు.

ఘనంగా సంత్ గోర కుంభర్ మహరాజ్ పుణ్యతిథి



రుద్రూర్: పోతంగల్ మండల కేంద్రంలోని విఠలేశ్వర రుక్మిణి, సంత్ గోర కుంభర్ మందిరంలో మంగళవారం మహరాజ్ పుణ్యతిథి ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. భజన కార్యక్రమాలు నిర్వహించారు.

ఇరుకు రోడ్డుతో ఇబ్బందులు

- నందిపేట మండల కేంద్రంలో రోడ్డు వెడల్పు జరిగేనా?
- మార్కింగ్‌కే పరిమితం



నందిపేట మండల కేంద్రంలోని ప్రధాన రహదారిలో ట్రాఫిక్ జామ్

నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలోని ప్రధాన రోడ్డు ఇరుకుగా మారడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ విషయాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రోడ్డు వెడల్పు పనులు చేపడతామని చెప్పి సంవత్సరాలు గడుస్తున్నా అధికారులు పనులు ఇప్పటివరకు ప్రారంభించలేదు. మూడేళ్ల క్రితం రోడ్డు వెడల్పు పనులు చేపడతామని ఆర్అండ్‌బీ అధికారులు మార్కింగ్ ఇచ్చి వదిలేశారు. నందిపేట మండలం చుట్టూ 32 గ్రామాలు ఉన్నాయి. అలాగే చుట్టుపక్కల మండలాల నుంచి వ్యాపార నిమిత్తం నందిపేటకు వస్తుంటారు. అలాగే గోదావరి నదిపై బ్రిడ్జి నిర్మించడంతో నిర్మల్ జిల్లా వాసులే కాక ఇతర జిల్లాల వారు వాహనాలపై వస్తుంటారు. దీంతో మండల కేంద్రంలో రద్దీ పెరిగిపోయి ప్రమాదాలు జరుగుతున్నాయి. మార్కింగ్ పెట్టి సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటివరకు ఎలాంటి పనులు చేపట్టలేదు. రోడ్డు వెడల్పు జరిగితే వ్యాపారాలు పెరిగి నందిపేట్‌తో పాటు ఇతర గ్రామాలు సైతం అభివృద్ధి చెందడమే కాక రాకపోకలకు ఇబ్బందులు ఉండవని స్థానిక ప్రజలు చెబుతున్నారు. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు శ్రద్ధ చూపి రోడ్డు వెడల్పు పనులు త్వరగా జరిగేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

త్వరగా పనులు చేపట్టాలి



నందిపేటలో రోడ్డు వెడల్పు పనులు చేపట్టి ప్రమాదాలు జరగకుండా చూడాలి. మూడు ఏళ్ల కింద అధికారులు మార్కింగ్ ఇచ్చి వదిలేశారు. గ్రామాభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని స్థానిక ప్రజాప్రతినిధులు రోడ్డు వెడల్పు పనులను చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలి

– కస్తూరి గంగాధర్, నందిపేట్

సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయండి



నందిపేటలో రోడ్డు వెడల్పు పనులు చేపట్టి సెంట్రల్ లైటింగ్‌ని ఏర్పాటు చేయాలి. మేజర్ గ్రామ పంచాయతీ అయినా నందిపేట్‌లో గతంలో ప్రజాప్రతినిధులు ఇచ్చిన హామీ మేరకు పనులు చేపట్టాలి. ప్రమాదాలను నివారించాలి.

– మూడ రాములు, నందిపేట

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



వెంకటాపూర్‌లో ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ విఠల్



పచ్చలనడ్కుడలో.. డీసీసీబీ వైస్ చైర్మన్ రమేశ్ రెడ్డి

మాక్లూర్: వెంకటాపూర్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు ప్రారంభించారు. డీఆర్‌డీవో చందర్‌నాయక్, ఎంపీడీవో క్రాంతి, మండల వ్యవసాయ అధికారి పద్మ, ఐకేపీ ఏపీఎం అనిల్‌కుమార్, వైస్ ఎంపీపీ సుక్కి సుజాత, సర్పంచ్ భవాని పాల్గొన్నారు.

పాలెంలో..

మోర్తాడ్: పాలెంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మోర్తాడ్ సహకార సంఘం చైర్మన్ బద్దం అశోక్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. డీసీసీబీ డైరెక్టర్ మొత్కు భూమన్న, వైస్ చైర్మన్ దడివె నవీన్, సర్పంచ్ ఏనుగు సంతోష్ పాల్గొన్నారు.

దోంచందలో...

ఏర్గట్ల మండలంలోని దోంచందలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీసీసీబీ వైస్ చైర్మన్ రమేశ్ రెడ్డి ప్రారంభించారు. తాళ్లరాంపూర్ సహకార సంఘం చైర్మన్ పెద్దకాపు శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ కొలిప్యాక ఉపేంద్ర, జెడ్పీటీసీ సభ్యుడు గుల్లె రాజేశ్వర్ పాల్గొన్నారు.

పచ్చలనడ్కుడలో..

వేల్పూర్: పచ్చలనడ్కుడ, పడగల్ గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను డీసీసీబీ వైస్ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. జాన్కంపేట్‌లో నడ్కుడ సొసైటి వైస్‌చైర్మన్ గుడాల రాములు ప్రారంభించారు. డీసీసీబీ డైరెక్టర్ శేఖర్ రెడ్డి, సొసైటీల చైర్మన్లు లింబారెడ్డి, హన్మంత్‌రెడ్డి, సర్పంచులు గంగారెడ్డి, రాజ్‌కుమార్, సొడరమేశ్, గోపు మహేశ్ అందజేశారు.

ఉప్లూర్‌లో..

కమ్మర్‌పల్లి: ఉప్లూర్‌లో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని చైర్మన్ రేగుంట దేవేందర్ మంగళవారం ప్రారంభించారు. నాయకులు బద్దం చిన్నారెడ్డి పాల్గొన్నారు.

బాబాపూర్‌లో..

భీమ్‌గల్: బాబాపూర్, మెండోరా గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహించే వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను జెడ్పీటీసీ చౌట్‌పల్లి రవి, ఎంపీపీ ఆర్మూర్ మహేష్ మంగళవారం ప్రారంభించారు. బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దొన్కంటి నర్సయ్య, ఏపీఎం కుంట శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నీలాలో..

రెంజల్(బోధన్): నీలా గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో, సాటాపూర్‌లో రెంజల్ విండో ఆధ్వర్యంలో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయా గ్రామాల సర్పంచ్‌లు లలితా రాఘవేందర్, ఎఖార్ పాషలు ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ యోగేష్, విండో చైర్మన్ మొయినొద్దీన్, ఏపీఎం చిన్నయ్య పాల్గొన్నారు.

కొత్త చైర్మన్‌కు బాధ్యతలు అప్పగించాలి



మోర్తాడ్: ఏర్గట్ల మండలం గుమ్మిర్యాల్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ ఎత్తిపోతల పథకం కమిటీ బాధ్యతలను కొత్త చైర్మన్ సోమ రాజారెడ్డికి ఇవ్వాలని రైతులు మంగళవారం తీర్మానం చేశారు. ఆయకట్టు రైతులు సమావేశం నిర్వహించి పాత కమిటీని రద్దు చేసినా కొత్త వారికి బాధ్యతలను అప్పగించకపోవడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. 1995 సహకార చట్టం ప్రకారం ఎత్తిపోతల కమిటీకి కొత్త చైర్మన్‌ను ఎన్నుకున్నామని రైతులు వెల్లడించారు.

ఇళ్లు నిర్మించుకునేందుకు రూ. 10 లక్షలివ్వాలి



కమ్మర్‌పల్లి: స్థలాలు ఉన్న పేదలకు ఇళ్ల నిర్మాణం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ. 5 లక్షలు చొప్పున రూ.10 లక్షలు ఇవ్వాలని అఖిల భారత ప్రగతి శీల రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సారా సురేష్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన కమ్మర్‌పల్లిలో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. రేషన్ దుకాణాల ద్వారా ప్రభుత్వం నాణ్యమైన బియ్యంతో పాటు, 12 రకాల సరుకులను ఉచితంగా సరఫరా చేయాలని అన్నారు. అదేవిధంగా వంటగ్యాస్ సిలిండర్‌ను రూ.500లకే అందించాలన్నారు.

డిమాండ్ల సాధనకు సమ్మె చేయనున్నాం



రుద్రూర్ ఎంపీడీవోకు సమ్మె నోటీసు అందజేస్తున్న ఐకేపీ వీవోఏలు



కోటగిరి ఎంపీడీవోకు..

– సమ్మె నోటీసుల అందజేత

రుద్రూర్: న్యాయమైన డిమాండ్ల సాధనకు ఈ నెల 24 నుంచి సమ్మె చేయనున్నట్లు ఐకేపీ వీవోఏలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఎంపీడీవో బాల గంగాధర్, ఐకేపీ ఏపీఎం భాస్కర్‌కు, ఏఎస్సై రాజుకు సమ్మె నోటీసులు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెట్టిన పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు 50 రకాల పనులు చేస్తున్నామని తెలిపారు. కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని, ఆరోగ్య బీమా వర్తింపజేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, తదితర డిమాండ్లను సాధించుకోవడానికి నిరవధిక సమ్మె చేయనున్నామని వారు చెప్పారు. కోటగిరి మండల అభివృద్ధి అధికారి మనోహర్ రెడ్డికి మంగళవారం వీవోఏలు సమ్మె నోటీస్ అందజేశారు.



రెంజల్‌లో ఏపీఎం చిన్నయ్యకు..

రెంజల్‌లో..

రెంజల్(బోధన్): ఐకేపీ ఏపీఎం చిన్నయ్యతో పాటు ఎంపీడీవోలను మంగళవారం స్థానిక వీవోఏలు కలిసి నోటీసులు ఇచ్చారు. తెలంగాణ గ్రామీణ పేదరిక నిర్మూలనలో పని చేస్తు మహిళా సంఘాలను ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేస్తున్నా తమకు చాలీచాలని వేతనం అందిస్తున్నారని వీఓఏలు ఆందోళన వ్యక్తం చేశారు.

బ్యాంకు ఏర్పాటు చేయండి



రుద్రూర్: మండల కేంద్రమైన పోతంగల్‌లో కో–ఆపరేటివ్ బ్యాంకు ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తూ మంగళవారం బస్టాండ్ సమీపంలో ఆందోళన చేశారు. కొత్తగా మండలమైన పోతంగల్‌లో బ్యాంకు అవసరముందని, ఒకే బ్యాంకు ఉండడం వల్ల మండల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. బ్యాంకు ఏర్పాటుకు స్థానిక ప్రజాప్రతినిధులు శ్రద్ధ తీసుకోవాలని కోరారు.

రైతు బీమా కాపీ అందజేత

బాల్కొండ: మండల కేంద్రంలో బొర్ర రాజమణి, బోదేపల్లికి చెందిన దేవిరాజ్‌లు కొంత కాలం క్రితం మరణించారు. వారికి రైతు బీమా ఉండటంతో రూ.5 లక్షల విలువైన బీమా ప్రొసీడింగ్ కాపీలను మంగళవారం వారి కు టుంబ సభ్యులకు అందజేశారు. సర్పంచ్ సునీత, వ్యవసాయ అధికారి మహేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సురాజ్‌రెడ్డి పాల్గొన్నారు

ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితం



అవగాహన కల్పిస్తున్న ఆర్మూర్ డిపో మేనేజర్

పెర్కిట్(ఆర్మూర్): గమ్య స్థానాలను సురక్షితంగా చేరుకోవడానికి ఆర్టీసీ బస్సులోనే ప్రయాణించాలని ఆర్మూర్ ఆర్టీసీ డిపో మేనేజర్ కవిత సూచించారు. ఆర్మూర్ మండలం పిప్రిలో మంగళవారం ప్రజల వద్దకే ఆర్టీసీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎం కవిత మాట్లాడుతూ.. దివ్యాంగులకు ఆర్టీసీ బస్సులో ప్రయాణించడానికి 50 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు తెలిపారు. అలాగే డయాలసిస్ చేయించుకునే రోగులకు ఉచిత బస్ పాస్ సౌకర్యం కల్పిస్తున్నట్లు వివరించారు. దీంతో పాటు తిరుపతి వెళ్లే ప్రయాణికుల కోసం దర్శనం టోకెన్లను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. సర్పంచ్ ఆసపురం దేవి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీటీసీ సామెర సురేష్, వీడీసీ అధ్యక్షుడు మల్లయ్య, సొసైటీ వైస్ చైర్మన్ గుండా లింగన్న, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

'ఉపాధి హామీ'ని ఎత్తివేసే కుట్ర



మాట్లాడుతున్న మాజీ విప్ ఈరవత్రి అనిల్

వేల్పూర్: కాంగ్రెస్ హయాంలో తీసుకొచ్చిన ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని ప్రభుత్వ మాజీ విప్ ఈరవత్రి అనిల్ ఆరోపించారు. వాడి గ్రామంలో మంగళవారం ఆయన కాంగ్రెస్ హాథ్ సే హాథ్ జోడో యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. ఈ పథకాన్ని ఎత్తివేసే కుట్ర పన్నుతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ధరలు నిత్యం పెరుగుతున్నా కూలీ రేట్లు మాత్రం పెరగడం లేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఉపాధి కూలీ రేట్లు పెంచుతామని, ధరలు అదుపులో ఉంచుతామని చెప్పారు. అంతేగాక ఏకకాలంలో రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, ఇళ్లులేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల కోసం రూ.5 లక్షలు అందిస్తామన్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నీరడి భాగ్య, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరాలు ప్రారంభం

బాల్కొండ: ముప్కాల్ మండలం కొత్తపల్లిలో మంగళవారం కంటి వెలుగు శిబిరాన్ని ఎంపీపీ సామ పద్మ, జెడ్పీటీసీ బద్దం నర్సవ్వలు ప్రారంభించారు. సర్పంచ్ విష్ణు, ఎంపీటీసీ వెంకట్‌రాజ్‌పాల్గొన్నారు.

జలాల్‌పూర్‌లో..

జలాల్‌పూర్‌లో కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ కల్పన ప్రారంభించారు. ఎంపీటీసీ లత, ఉప సర్పంచ్ లింబారెడ్డి, ఎంపీడీవో సంతోష్ ఉన్నారు.

అమీన్‌నగర్‌లో..

కమ్మర్‌పల్లి: అమీర్‌నగర్‌లో కంటి వెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ పుప్పాల గంగాధర్ మంగళవారం ప్రారంభించారు. ఉప సర్పంచ్ రాజేందర్ ఉన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అవగాహన

రెంజల్(బోధన్): తాడ్‌బిలోలిలో సోమవారం రాత్రి పోలీస్ కళాబృందం నిర్వహించిన ప్రదర్శనలు స్థానికులను ఆకట్టుకున్నాయి. సమాజంలో జరుగుతున్న మోసాలను నాటికలు, ప్రదర్శనల ద్వారా కళ్లకు కట్టినట్లు వివరించారు. ఈ సందర్భంగా ఎస్సై పండ్ల సాయన్న మాట్లాడుతూ.. ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. గల్ఫ్ దేశాలకు వెళ్తున్న వారు నకిలీ ఏజెంట్ల పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు.

పిచ్చి కుక్కల దాడిలో నలుగురికి గాయాలు

నవీపేట: మండల కేంద్రంలో పిచ్చి కుక్కలు ప్రజల్ని బెంబేలెత్తిస్తున్నాయి. మంగళవారం పిచ్చికుక్కలు నలుగురిని కరిచాయి. గాండ్ల గంగలక్ష్మి, ఎర్ర ఆనంద్, మోహన్, హాజీలు గాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన బాధితులు నవీపేట, నిజామాబాద్ ఆస్పత్రులలో చికిత్స పొందుతున్నారు.

సీపీఎం సీనియర్ నేత మృతి

రుద్రూర్: బొప్పాపూర్‌కు చెందిన సీపీఎం నేత నామ్ శంకర్ సోమవారం అర్ధరాత్రి గుండెపోటుతో మరణించారు. 25 ఏండ్లుగా సీపీఎంలో నమ్మిన సిద్ధాంతం కోసం ప్రజల పక్షాన పోరాడారు. మంగళవారం అంత్యక్రియల్లో సీపీఎం నేతలు రమేష్ బాబు, వెంకట్రాములు, తదితరులు పాల్గొన్నారు.

సమాచారం..

రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆర్మూర్‌టౌన్: పట్టణంతో పాటు అంకాపూర్ గ్రామంలో ఈ నెల 20న విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ శ్రీధర్ తెలిపారు. 132/33కేవీ ఆర్మూర్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి 10 వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు.

నూతన కమిటీ..

ఉమ్మెడ బీఆర్ఎస్ గ్రామ కమిటీ..



నందిపేట్(ఆర్మూర్): ఉమ్మెడలో బీఆర్ఎస్ యువజన విభాగం జిల్లా నాయకులు పొద్దుటూరు అభిలాష్ రెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించారు. వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని సూచించారు. మండల యువజన విభాగం అధ్యక్షుడిగా ప్రశాంత్, ఉమ్మెడ శాఖ యువజన విభాగం అధ్యక్షుడిగా దర్శన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకొని నియామక పత్రం అందజేశారు. ఉమ్మెడ సర్పంచ్ పోశెట్టి, ఎంపీటీసీ మనోజ్ రావు పాల్గొన్నారు.

ప్రారంభం..

టీజీబీ శాఖ



భీమ్‌గల్: తెలంగాణ గ్రామీణ బ్యాంక్(టీజీబీ) నూతన శాఖను భీమ్‌గల్‌లో మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన బ్యాంక్ చైర్‌పర్సన్ శోభ, నిర్మల్ రీజనల్ మేనేజర్ మహీ వివేక్ మాట్లాడుతూ.. నూతన శాఖ ప్రారంభోత్సవం రోజున డ్వాక్రా సంఘాలకు రూ.కోటి రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు.

పచ్చలనడ్కుడలో..

వేల్పూర్: తెలంగాణ గ్రామీణ బ్యాంకు సేవలను ఉపయోగించుకోవాలని టీజీబీ రాష్ట్ర చైర్మన్ శోభ పేర్కొన్నారు. పచ్చలనడ్కుడలో టీజీబీ నూతన భవనాన్ని మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వాణిజ్య బ్యాంకుల ద్వారా లభించే సేవలన్నీ తెలంగాణ గ్రామీణ బ్యాంకులో లభిస్తాయన్నారు.

స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ్ శిక్షణ..



మాక్లూర్: ఎంపీడీవో క్రాంతి ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగే స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ్ శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, డీఆర్‌డీవో చందర్‌నాయక్‌లు ప్రారంభించారు. స్వచ్ఛ భారత్ ద్వారా చేపట్టే పనులను గ్రామాల్లోని ప్రజలు పూర్తిగా అమలు పరిచేలా చేసేందుకుగాను ఈ శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టారు. పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు స్థానిక రైతు వేదికలో శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

రోడ్డు విస్తరణ పనులు..



వేల్పూర్: 63వ నంబరు జాతీయ రహదారిలో కుకునూర్ క్రాస్ రోడ్డు వద్ద రోడ్డు విస్తరణ పనులను బీఆర్ఎస్ నాయకులు మంగళవారం ప్రారంభించారు. జాతీయ రహదారి నుండచి కుకునూర్, కోమన్‌పల్లి, వెంకటాపూర్ గ్రామాల మీదుగా వేల్పూర్ దాకా 9 కిలోమీటర్ల రహదారిని డబుల్ రోడ్డుగా మార్చడానికి మంత్రి ప్రశాంత్ రెడ్డి రూ.15 కోట్లు మంజూరు చేయించి, ఇటీవల శంకుస్థాపన చేశారు. దాంతో రహదారి విస్తరణ పనులను ప్రారంభించారు. వైస్ ఎంపీపీ బోజపల్లి సురేష్, సర్పంచ్ శ్రీరాం విజయ, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

సీఎం, స్పీకర్ చిత్రపటాలకు పాలాభిషేకం

రుద్రూర్: ముస్లింల సంక్షేమం కోసం పథకాలు అమలు చేస్తున్న ఏకైక సీఎం కేసీఆర్ అని ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు లాల్ మొహమ్మద్ అన్నారు. రుద్రూర్ మండలం చిక్కడపల్లి గ్రామంలో మంగళవారం సీఎం కేసీఆర్, స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం ప్రభుత్వం సరఫరా చేసిన రంజాన్ కానుకలను లబ్ధిదారులకు పంపిణి చేశారు.

రంజాన్ కానుకల పంపిణీ

ఎడపల్లి(బోధన్): ఎంఎస్‌సీ ఫారం గ్రామ మజీద్‌లో మంగళవారం రంజాన్ కానుకలను బీఆర్ఎస్ నేతలు పంపిణీ చేశారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నాగేందర్ రెడ్డి, భూపాక భూషణం, జైతాపూర్ సొసైటీ వైస్ చైర్మన్ తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

ముప్కాల్ పరిధిలో..

బాల్కొండ: రంజాన్ కానుకలను ముప్కాల్ మండల కేంద్రంలో ఎంపీపీ సామ పద్మ, జెడ్పీటీసీ బద్దం నర్సవ్వలు పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ ఆకుల చిన్న రాజన్న, కోఆప్షన్ సభ్యుడు మునీరొద్దీన్, తహసీల్దార్ విక్రమ్, ఆర్ఐ గంగాధర్ పాల్గొన్నారు.

బాల్కొండ మండలంలో..

బాల్కొండ మండలంలో రంజాన్ కానుకలను ఎంపీపీ లావణ్య, జెడ్పీటీసీ దాసరి లావణ్యల చేతుల మీదుగా మంగళవారం పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ శ్రీకాంత్, కో–ఆప్షన్ సభ్యుడు ఫయాజ్, ఎంపీడీసీ సంతోష్‌కుమార్, తహసీల్దార్ వినోద్, సర్పంచ్ బూస సునీత పాల్గొన్నారు.

రుద్రూర్‌లో..

రుద్రూర్: మండల కేంద్రంలో ముస్లింలకు పీఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రంజాన్ కానుకలను బాన్సువాడ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి పోచారం సురేందర్ రెడ్డి పంపిణీ చేశారు. జెడ్పీటీసీ నరోజి గంగారాం, విండో చైర్మెన్ సంజీవ రెడ్డి, బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

ఘనంగా ఇఫ్తార్ విందు

బోధన్‌రూరల్(బోధన్): సాలూర మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మంగళవారం విందులో భాగంగా మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు ముస్లీం మతపెద్దలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం విందులో పాల్గొన్నారు. ఎన్‌డీసీసీబీ డైరెక్టర్ గిర్దావర్ గంగారెడ్డి, ఏఎంసీ చైర్మన్ వీఆర్ దేశాయ్, వైస్ చైర్మన్ ఎండీ షకీల్, ఏసీపీ కిరణ్, సీఐ శ్రీనివాస్ రాజ్, తహసీల్దార్ వర ప్రసాద్ హాజరయ్యారు.

లక్ష్మాపూర్‌లో..

రుద్రూర్: చందూర్ మండలం లక్ష్మాపూర్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో స్థానిక ప్రజాప్రతినిధులతో కల్సి బీఆర్ఎస్ నేత పోచారం సురేందర్ రెడ్డి పాల్గొన్నారు. సర్పంచ్‌లు బోడ్డోళ్ల సత్యనారాయణ, కర్లం సాయరెడ్డి కూడా హాజరయ్యారు.

పింఛన్లు మంజూరు చేసి ఆదుకోండి

బోధన్‌టౌన్(బోధన్): బల్దియా పరిధిలో పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ప్రభుత్వం మంజూరు చేసి వారిని ఆదుకోవాలని ఎంఐఎం పట్టణ అధ్యక్షులు ముషీర్ బాబా డిమాండ్ చేశారు. బల్దియా పరిధిలో 1075 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, విచారణ కూడా పూర్తయిందని, వెంటనే మంజూరుకు చర్యలు తీసుకోవాలన్నారు.